# అల్లుడి చదువు

కథానిక

"నేను అతని చదువు తప్పితే మరొకటి గమనించలేదోయ్" అన్నాడు శశిధరశాస్త్రి, స్నేహితుడైన వీరరుద్రరావుతో, తన అల్లుడైన శారదాపతిని ఉద్దేశించి.

వీరరుద్రరావు ఆశ్చర్యంగా వింటున్నాడు. ఎందుచేతంటే, అతనికీ ముగ్గురాడపిల్లలున్నారు, మగసంతానం కూడావుంది. పెద్దపిల్ల పెళ్ళి ఈడుకి వచ్చింది. పెళ్ళి విషయమై కాస్తోకూస్తో ప్రయత్నం చేస్తున్నాడు. అది ఏదో సముద్రాన్ని ఈదబోతున్నట్టుగా కనబడుతూంది కాని సామాన్యంగా కనబడలేదు. "శాస్త్రీ! నువ్వు చెప్పినది నిజమేకాని కాస్తోకూస్తో ఆస్తికూడా లేకపోతే బొత్తిగా దగా అయిపోతామేమో అని!" అన్నాడు వీరరుద్రరావు.

"నీకు పరమేశ్వరుడి మీద నమ్మకముందా?" అని చల్లగా ప్రశ్నించేడు శశిధరశాస్త్రి.

"నమ్మకముంది కాని గాలిలో దీపం పెట్టి దేవుడా నీదేభారమంటే ఎలాగు! చూసి చూసి సముద్రంలో దిగగలమా?"

"ఇదిగో ఈ సంగతి చూడు. పట్టి స్కూలు ఫైనల్ గట్టెక్కిన వాడి విలువ వెయ్యి, ఇంటర్ మెట్రెక్కిన వాడి ఖరీదు రెండువేలు, బి. ఏ. ముగించిన వాడి పాట మూడువేలు! ధరలిట్లా గుంటే ఎట్లాగు బతకడమో చెప్పు? మన సంగతి చూస్తే ఈ చేతికి అయిదువేళ్లు, ఆ చేతికి అయిదు వేళ్ళు!"

"నువ్వు కాళ్ళ మాట మరిచిపోయేవోయ్ శాస్త్రీ!"

"నీ కింకా అనుభవం లేదు బాబూ! దానికి కారణం చెపుతాను. చేతులతో బతిమాలుకోంటేనే రోజులు గడవడం లేదుకదా ఇహ మరేమి చెప్పమన్నావు! ఈలాగు ఇన్ని ప్రతిబంధకాలుండగా ఇటు చదువు, అటు ఆస్తి ఉన్న కుర్రవాడిని కొనడానికి మనకి తాహత్తు ఉండవద్దూ భాయీ!"

"రామ రామ! నా సంపాదనంతా మూడు మారు లెక్కబెడితే నూటపదహార్లు కాదుకదా. పిల్లకి పెళ్ళి ఎలాగు చెయ్యను, సంసారమెలాగు ఈదను!" అని రావు బెంగపడిన వాడిలాగు కనబడ్డాడు.

"నువ్వూ చిట్టచివరకి నా దారికే వస్తున్నావులే! ఫరవాలేదు! అందుకనే నేను మొట్టమొదటే దేవుడిమీద భారంవేసి పట్టి చదువేకాని ఆస్తి మాట తలపెట్టక అమ్మాయికి ఏదో మూడుముళ్లు పడితేచాలని స్కూలుఫైనల్ చిన్న మనిషికి కట్టబెటేను!" అన్నాడు శాస్త్రి.

"నువ్వు ఎలాగయినా అదృష్టవంతుడివే!" అని మెచ్చుకొన్నాడు వీరరుద్రరావు.

"నా యెదం! నా అదృష్టాన్ని నువ్వు మెచ్చుకోవలసిందే. నేనే అంత అదృష్టవంతుణ్ణయితే ఒక్క కానీ కట్న మక్కరలేకుండా బుద్ధిమంతుడైన పిల్లవాడు దొరకక పోనా! మన నుదుటి వ్రాత ఇంతే!" అని శాస్త్రి ప్రారబ్ధవిశ్వాసిలాగు కనబడ్డాడు.

"పోనీలే! మీ అల్లుడు బుద్ధిమంతుడు!"

"నేనూ అదేచూసి సంతోషిస్తున్నాను. ఏదో సొమ్ముపోయి రిమ్మపట్టిందన్న సామెతగాకుండా ఇదీ ఒక మేలే!"

"కాని అలుని మంచితనంబును, గొల్లని సాహిత్య విద్య అని రెండిటినీ సమానం చేశాడు సుమతీశతక కారుడు!" అన్నాడు రావు సరదాగా.

"ఆ పైత్యపు రాతల కేమిటిలే! అమ్మాయిని కాపరానికి పంపిస్తే ఒక బాధ్యత తగ్గిపోతుందని నేను అనుదినం చాతకపక్షిలాగు ఆ దినంకోసం ఎదురుచూస్తున్నాను!" అన్నాడు శాస్త్రి.

"ముహూర్తం నిర్ణయమయిందా?"

"ఏదీ! ఇప్పటికప్పుడే పిల్ల సమర్తాడి రెండేళ్లయింది. అతను కార్యమంటే ఇదిగో అదిగో

టేకుమళ్ల కామేశ్వరరావు

అంటున్నాడు. ఆ పిల్లను దాని ఇంటికి పంపించి వేసి తల కడుక్కొన్నట్టుగా తలచే రోజు ఎప్పుడు వస్తుందా అని ఇదైపోతున్నాను" అని శాస్త్రి ఆలోచనలో కొంతసేపు బహిర్లోకం మరిచి పోయేడు.

"ఏదయినా నీ జాతకం మంచిది శశిధర శాస్త్రీ!"

"నువ్వు మెచ్చుకోవలసిందే!"

"కాకపోతే అట్లాంటి అల్లుడు దొరకడం అందరికీ తటస్థించదనుకో!"

"నువ్వు అట్లాగంటున్నావు కాని నా బాధలతో నాకు ఊపిరి తిరగడం లేదు. ఇదిగో పరమ రహస్యం! మళ్లీ ఎక్కడేనా అనేవు సుమా! ఎవరు చెప్పినా మా అల్లునికి కొన్ని తిక్కలున్నాయంటారోయ్!"

"నీ వెర్రిగాని, ఏ అల్లుడికి ఉండదో చెప్పవూ!"

"అదైనా నేను మావాణ్ణి గురించి నొక్కి చెప్పడం లేదు. నలుగురూ అనుకొనే మాట చెప్పేను. అంతే! పాపం పుణ్యం భగవంతుడికి తెలియాలి!" అన్నాడు శాస్త్రి.

"వాటితో మనకేం సంబంధం లేదు లే!" అని వీరరుద్రరావు కొట్టిపారేశాడు.

"అలాగనుకొనే నేనూ సంతోషిస్తున్నాను" అని శాస్త్రి పళ్లు కనబరచేడు.

వీరరుద్రరావు ఆఫీసుకి పోవలసినవాడు కాబట్టి సంభాషణను అంతటితో తుంచివేసి యింటికి బయలుదేరాడు.

శశిధరశాస్త్రి గుమ్మందగ్గరకి పోస్టుమేను వచ్చి ఒక ఉత్తరం చేతిలో పెట్టేడు. పై విలాసం చూడగానే శాస్త్రికి అది వియ్యపురాలి దగ్గరనుంచి వచ్చిన ఉత్తరమని బోధపడింది. లోపలి సంగతులు చూడడానికి తొందరపడ్డాడు.

శశిధరశాస్త్రి అల్లుడైన శారదాపతి బి. ఏ. ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. పాశ్చాత్య విద్యే విద్య అనీ, పాశ్చాత్య నాగరికతే నాగరికత అనీ అతను బాహాటంగా చెప్పతూ ఉంటాడు. తాను విద్యావంతుడు కాబట్టి చదువు సంధ్యలు తక్కువైన భార్యని తలపోసి ఆమెతో కాపరం చెయ్యడమేలాగు అని బెంగపెట్టుకొన్నాడు. "మా ఇద్దరికీ ఎలాగు జత కుదురుతుంది? ఒక బండికి అటు అరేబియా గుర్రాన్ని ఇటు నాటు పోతుని కట్టితే ఆ బండి ఎలాగు సాగుతుంది? పోనీ అంటే అది ఉన్న చోటునైనా ఉండదు. గానుగలాగు తిరుగుతుంది. ఆహాహా! అభ్యుదయానికీ గుంట పువ్వుల పూతకీ సంబంధం ఏమిటి?" అని మధనపడి చివరకి ఒకనిర్ణయానికి వచ్చేడు. పరిస్థితులు నేరుగా మామగారికి తెలియ చెయ్యడానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. తన ఆలోచనలన్నీ తల్లితో చెప్పేడు. ఆమె తిరిగి చెప్పిన సమాధానాలు అతనికి నచ్చలేదు. "నీ ఇష్టం ఎలాగు ఏడుస్తే అలాగు ఏడువు!" అంది తల్లి. కాని శారదాపతి ఊరుకోక ఆమెను నిర్బంధించి మామగారికి ఉత్తరం రాయించేడు.

శశిధరశాస్త్రి వియ్యపురాలి ఉత్తరం చూసి నిర్ఘాంతపోయేడు. "ఇదేమిటి ఈ వెర్రి! కాని ఏమనుకొంటే ఏమిలాభం! కూతురిని ఏడాది మూడో ఫారం పాసు చెయ్యమని అల్లుడి ఆజ్ఞ! లేకపోతే తన ఇంటికి పంపించవద్దనాడు!" శశిధరశాస్త్రి అనేక విధాలుగా ఆలోచించేడు. అలుడిదగ్గరకి తక్షణం ప్రయాణం కట్టేడు. అల్లుడు ఇంటిలో లేకపోగా వియ్యపురాలితో సవిస్తరంగా చెప్పేడు. కాని ఆమె "ఈ ఇంటిలో నా పెత్తనం అంతరించింది నాయనా! మీ అల్లుడు ఎటూ చెప్పితే అట్లా మీరూ నేనుకూడా నడుచుకోవలసిందే, దారిలేదు!" అంది.

శారదాపతి మొండిపట్టు విడవలేదు. శాస్త్రి ఖిన్నుడై కొంపకి చేరుకొన్నాడు.

ఏడుపులోనే కొంత సంతోషం వున్నట్టుగా కింకిణమ్మ ఇదివరకు ఒకటో ఫారం పూర్తి చేసింది. ఆ అమ్మాయి చదువుకోసం శాస్త్రి నడుము కట్టేడు. ఇంగ్లీషుతో ఎనిమిదో తరగతి పరీక్షకి కట్టించేడు. ఎట్లాగయితేనేమి కూతురిని గట్టెక్కించేడు, తాను ఆనందసముద్రంలో మునకలు వేశాడు.

ఇంతమట్టుకు వచ్చేక శాస్త్రి కొంచెం బుద్ధిని ఉపయోగించేడు. కింకిణమ్మని నాలుగో ఫారలో చేర్పించేడు.

శారదాపతి బి.ఏ. లో విజయుడయేడు. ఆ పై చదువుకి చేతిలో పైసలేదు. అంతవరకూ నెట్టుకురావడమే బ్రహ్మాండమయింది. అందుచేత మరి చదువు మాట తలపెట్టక చక్కగా ఉద్యోగా

న్వేషణ మొదలు పెట్టేడు. కాని ఉద్యోగం చేకూరక పై(పై)వేటులు చెప్పుకొని ఎలాగో కాల క్షేపం చేస్తున్నాడు.

శశిధరశాస్త్రి ఆ పదినం అలుడి దగ్గరనుంచి జాబుకోసం ఎదురు చూస్తున్నాడు. తానే బాబాకరంగా జాబులు రాస్తే అల్లుడు మరీ లోకువ కట్టివేస్తాడని భయపడి తనమీద నేరం లేకుండా అప్పుడప్పుడు మామూకానులు వ్యవహారార్థం ఖర్చు చేస్తూండేవాడు. కాని శారదాపతినుంచి ఒక్కదానికీ జవాబుమట్టుకు ఎప్పుడూ రాలేదు. కారణం తెలియదు.

ఒకరోజున శాస్త్రి తెగించి అల్లుడి ఇంటికి ప్రయాణమయేడు. వియ్యపురాలు దేనికికూడ సమాధానం చెప్పలేకపోయింది. శారదాపతి మొహం చాటుచెయ్యగా, దర్శనం దొరకడమే దుర్లభమయిపోయింది. ఎట్టకేలకు ఎదురుపడగా శారదాపతి "కార్యం విషయమై మేము తొందరపడాలి కాని మీ కెందుకండీ!" అని ఒక్క ముక్క అని లేచిపోయేడు. శాస్త్రి ఎట్లాగు వెళ్ళేడో అట్లాగే తిరిగి వచ్చేడు.

రోజులు గడిచిపోతున్నాయి. శారదాపతి మనఃస్థితి వర్ణనాతీతంగా ఉంది. "నాకు ఉద్యోగమా దొరకలేదు. రోజులు దొర్లిపోవడమే బ్రహ్మాండంగా ఉంది. ఆటువంటప్పుడు భార్యని కూడా తెచ్చి పెట్టుకోను! బంధువులు వచ్చిపోతూంటే ఖర్చు లెక్కడ భరించను! కుటుంబం ఒక ఏటికొక ఏడు వృద్ధవుతూంటే నా పాట్లు కుక్కలు కూడా పడవు! కాబట్టి దానిని ఇంతటిలో తీసుకురాను. ఇటువంటి నా అవస్థ ఎవరితో చెప్పుకోను? చెప్పుకొంటే మానంపోదా? ప్రాణంపోయినాసరే కాని మానం పోతే బతకగలనా! కాబట్టి ఎత్తుపై ఎత్తువేసి గడుపుతూంటాను!" అని ఆలోచించేడు.

అల్లుడి చిత్తవృత్తి అంతుపట్టకపోగా శశిధరశాస్త్రికి ఆరాట మధికమయింది. "కింకిణమ్మని అల్లుడు ఏలుకోనేటట్లా, మానేటట్లా? ఉత్తరం రాస్తే సమాధానం రాదు. సమ్ముఖాన్ని తేల్చుకుందామంటే వెళ్ళిరావడం అయే పనికాదు. ఏదీ తేలక చస్తున్నాను!" అని శశిధరశాస్త్రి వాపోవుతున్నాడు. ఇంతటిలో అతనికి స్నేహితుడైన వీరరుద్రరావు సంగతి జ్ఞాపకానికి వచ్చింది. "వీరరుద్రరావుని మా అల్లుడిదగ్గరికి పంపించి విషయాలన్నీ సవిస్తరంగా కనుక్కోమంటాను" అని ఆలోచించేడు. అతను స్నేహితుణ్ణి కలుసుకొని సంగతులన్నీ చెప్పగా, ఆ స్నేహితుడు శాస్త్రి బాధచూచి ఇదివరకే విచారిస్తున్నాడు కాబట్టి అతనుచెప్పినట్టుగా శారదాపతిని కలుసుకోదలుచుకొన్నాడు.

శ్రమపడి వీరరుద్రరావు శారదాపతిదగ్గరికివెళ్ళినందుకు ఒక్క మాటమాత్రం తెలిసింది. కింకిణమ్మని స్కూల్ ఫైనల్ పరీక్ష పాసవనియ్యండి అని. ఆ సంగతి శాస్త్రికి వినిపించగా "ఇది అంతులేని పరిహాసంగా ఉందే! ఓహోహో! వేసినట్టే చూస్తే వెర్రివాడే గెలిచాడుట! అయినా ఆ స్కూల్ ఫైనల్ మాత్రం ఎంతదూరంలో ఉందిలే! మరొక్క ఏడాది ఓపిక పటితే చాలు. అయ్యగారి పస అప్పుడే బయటపడుతుంది!" అని ఆత్మహితం చెప్పుకొన్నాడు శాస్త్రి.

ఉద్యోగంకోసం శారదాపతి ప్రయత్నాలు ఎప్పటిలాగే ఉన్నాయి. అంతేకాదు. అతన్ని నిరాశ ఆవహిస్తూంది. "ఈ చదువు ఇంత వ్యర్థమైనదిగా నేను కలలోకూడ భావించలేదు, పరిహాసానికైనా అనుకోలేదు, బి. ఏ. పాసయినప్పటికీచదువుకోని ఆడదాని పాటివిలువైనా లేకపోయిందే? ఇది చాలా విచారకరంగా ఉంది. చదివి ఏదోవెలగబెడతాననుకొని మురిసిపోయాను! నా చదువు ఇంత వ్యర్థమైపోయిందా? చదువుకీ ఉద్యోగానికీ సంబంధమే లేదా? ఈ సంగతి చదువుకొంటూన్న రోజులలో తెలియకపోయెనే! అర్థములేని చదువు వ్యర్థమన్నారు. దాని అసలు అర్థము చదువుకొన్నవాడికికాని తెలియదు. అర్థములేని చదువేకాదు, అర్థములేని బతుకే వ్యర్థం. కాసు లేనివాడు పోకకైన గాడు అన్న మాట ముమ్మాటికీ నిజం!" అని తన కర్మకి భగవంతుణ్ణి కారకుడిగాచేసి తిట్టేడు.

కింకిణమ్మ స్కూలుఫైనల్ పాసయింది. కాని తండ్రి ఆదుర్దా రెట్టింపయింది. "దాని బతుకేమయినట్టు! నా స్థితి చూస్తే రాక్షసులకి జాలి పుట్టేటట్లా ఉంది. కాని మా అల్లుడికి మట్టుకు జాలి పుట్టడంలేదు. అతను ఇంత కిరాతకుడయేడా, పోనీ ఆ పిల్ల ఈలాగే ఇంటిలో పడివుంటుం

దంటే, ఆ అమ్మ తర్వాత ఇంకా పెళ్లి కావలసిన అమ్మలు, అయ్యలు కూడా ఉన్నారు. తినేనోరు ఒకటి తగ్గినా కుటుంబ భారం కొంత తగ్గినట్లే అని భావిద్దామంటే ఇది ఎడతెగని సమస్యగా పరిణమించింది. ఇటుపైని ఏమిచెయ్యను? అల్లుడి స్థితి చూస్తే ఆశాజనకంగాలేదు. ఇంక ఆ పిల్లకి చదువు చెప్పించే స్తోమత నా దగ్గరలేదు! లేదు! లేదు! అల్లుడు కనక ఏలుకోకపోతే ఇన్నాళ్ళూ పడి ఉన్నట్లే పడుంటుంది సరే! ఎదిగిన పిల్లని ఎన్నాళ్ళని ఇంటిలో పెట్టుకోను. నేను తలెత్తుకోలేకుండా ఉన్నాను. ఈ విషయమిట్లాగుండగా నేను తిండి పెట్టనూలేక దానిని సంపాదించుకోనియ్యక ఆ దెట్లాగు బతకడం? కాబట్టి మొదట దాని ఉద్యోగం సంగతి చూసి తర్వాత అల్లుడి మాట కనుక్కుంటాను. పడవలసిన ఇబ్బందులు పడక తప్పదు!" అనుకొన్నాడు. అతను ఉద్యోగ ప్రయత్నం గట్టిగా చేశాడు.

కింకిణమ్మకి స్థానిక సంస్థలో గుమాస్తా పదవి లభించింది. ఆమెయే తెగించి భర్తకి ఉత్తరం రాసింది. అది చదువుకొని శారదాపతి పరమాశ్చర్యపోయేడు. కోడలి దగ్గరికి ప్రయాణంకోసం మూటలు సిద్ధపరచింది తల్లి.

స్కెచ్

# "నువ్వు కాబట్టి—"

రంధి సోమరాజు

గాలి వీచింది, ధూళి లేచింది. ఇక చూడండి ఆ వీచినగాలి, లేచినధూళి సలిపే సరసాలు! మనుషున్నారని కాస్త ఆ మోహాలకు సిగ్గేనా లేదు. నడివీధిలో ఇచ్ఛవచ్చినట్లు ప్రణయోన్మాదంతో పరుగులు పోతున్నాయి. ఇదంతా భరించలేని మనసు ఇంటికిదారితీసింది. దారితీయడమైతే జరిగింది కాని—అడుగు పడటం లేదు. 'అప్పుడే ఇంటికి వెళ్ళడమేమిటి? ఇంకా దీపాలైనా పెట్టే వేళ కానేలేదు. అయినా ఈ వేళప్పుడు ఇంటికి అఘోరించిందెప్పుడు? ఇలా ఈ సమయంలో ఇంటికి వెళ్ళడం...అదో క్రొత్తగా ఉంది. మా వీధిలోని సుందరీమణులంతా చూసి నవ్వుతారేమో-వాళ్ళ సోదరీమణికోసం ఇంత జరూరుగా హాజరైనందుకు! కాని ఈ దుమ్మురాక్షసి ఈ గాలి రాక్షసుడూ ఇలా పేట్రేగిపోతూంటే—ఇక వెళ్ళక తప్పుతుందా ఏమిటి? అదేమిటో గాని కంట్రోల్సు ఎత్తెయ్యగానే కొండంత ఎత్తున లేచి, షావుకారు ప్రియుణ్ణి బిగ్గరగా కౌగిలించుకుంటూన్న ఎంతో ప్రియమైన బియ్యం ధరల్లాగ, ఒకటే లేచిపోతూంది దుమ్ము! ఆ ధరా, ఈ దుమ్మూ సరిగ్గా ఒక్కటే; మన ప్రాణాలు తియ్యడానికి!

ఇష్టంలేకుండా శరీరాన్ని అలాంటి వేళప్పుడు ఇంటికి చేరవేయడమనేది నేనెప్పుడూ చేయలేదు. కానయితేనేం ఆనాడు జరిగింది. ఆనాడు ఇంకొకటికూడా జరిగింది. అది మా ఆవిడ ఏనాడూ లేనిది అన్ని పనులూ చక్కబెట్టుకొని కేవలం నా రాకకోసమే అన్నట్టుగా ఎదురుచూస్తూ కూర్చోవడం! ఏదో విశేష ముందనుకున్నాను. ఉందనే సూచన ఆమె ముఖంలో స్పష్టంగా వ్రాయబడే ఉంది. పైపెచ్చు ఓ చిరునవ్వు సగంసగంగా ప్రదర్శించి మిగతాసగాన్ని మింగేసింది. "ఏమిటీ"అన్నట్టుగా నేను నవ్వాను. ఇప్పుడప్పుడే చెప్పడానికి వీల్లేదన్నట్టుగా ఆమె కళ్ళు పోజుపెట్టాయి. సరేలే, చెప్పకుండా ఎక్కడికి పోతుందనుకుంటూ స్నానానికి నీళ్లు పడేయమన్నాను. ఆమె నిముషాలమీద పని ముగించింది. నేనుకూడా త్వరలోనే తెమిల్చిపారేశాను. అప్పటికందుకుంది మా ఆవిడ. "ఎప్పుడూ లేదు; ఇంత త్వరగా దయచేశారేం" అంటూ. అందుకు నేనేమీ జవాబు చెప్పలేదు. అయినా దానికామె జవాబు పొందవలసిన అవసరమే లేదన్నట్టుగా కోరుకుని—మళ్ళీతనే—"మీకో మంచివిషయం చెబుతాను; మీ రేదేనా బహుమతీ ఇస్తానంటే"